క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.సంజయ్ జాతీయస్థాయి స్కూలు గేమ్స్ హాకీ అండర్–14 పోటీలకు ఎంపికయ్యారని హెడ్మాస్టర్లు దయా, స్వప్న తెలిపారు. శుక్రవారం ఆ విద్యార్థిని వారితోపాటు పీఈటీ ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల అభ్యసన ప్రక్రియపై అవగాహన

వేముల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ రామసుబ్బయ్య విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరు పట్టిక, ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందించి మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి, వెనుకబడిన విద్యార్థుల అభ్యసన ప్రక్రియలో తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. అలాగే సంకల్ప్ పథకం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రూపొందించిన షెడ్యూల్‌ను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి

వేంపల్లె : సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీ, అంబేడ్కర్ సేవా సమితి నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేసి భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామన్నారు. వెంటనే భారత ప్రజానీకానికి ఆయన క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి బ్రహ్మం కొత్త కాల్వ, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో కన్వీనర్ రహమతుల్లా, అంబేడ్కర్ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

సింహాద్రిపురం : గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సంబంధిత అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్దిష్ట కాలంలో పనులు పూర్తి చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి

కమలాపురం : రైతులు సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. శుక్రవారం సబ్సిడీపై వచ్చిన డ్రిప్, స్ప్రింకర్ల లారీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలసి వాటిని రైతులకు అందజేసి మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో, అలాగే 5 ఎకరాలకు పైన ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో ప్రభుత్వం డ్రిప్ పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. అలాగే స్ప్రింకర్లు 55 శాతం, 45 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామన్నారు. మైక్రో ఇరిగేషన్ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డ్రిప్, స్ప్రింకర్లు కమలాపురంలోనే ఫస్ట్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమాధవేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన వాసవీ మాత

వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ మాధవేశ్వరిదేవిగా అలంకరించి, ఉత్సవ విగ్రహ అమ్మవారిని గోదాదేవిగా అలంకరించి దర్శనం కల్పించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. ధనుర్మాసం రెండవ శుక్రవారం పురస్కరించుకుని ఆలయంలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో పూజలు చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడి ఎంపిక

వీరపునాయునిపల్లె : స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బీజేపీ మండల శాఖ అధ్యక్ష ఎన్నిక నిర్వహణ నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు సంస్థాగత ఎన్నికల ప్రముఖ అధ్యక్షుడు ఉప్పల శ్రీనాథ్‌రెడ్డి హాజరై మండలంలోని యరమలపల్లెకు చెందిన తులసినాయుడును మండల అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. దీంతో గతంలో ఉన్న అధ్యక్షుడు గవేశ్ యాదవ్ ఎటువంటి సమాచారం అందించకుండా ప్రకటించడంపై అభ్యంతరం తెలిపారు. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపిక ఏక పక్షంతో ఉండదని అందరి అభిప్రాయంతోనే ఎంపిక జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్ఓ గుత్తిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెంగిటి సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీరం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలి
- రూ.15వేల కోట్ల అదనపు భారాన్ని ప్రజలపై మోపడం సరికాదు
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందులలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్/టౌన్ : విద్యుత్ చార్జీల పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద, మధ్య తరగతి కుటుంబాలపై బాదుడే బాదుడు అంటూ విద్యుత్ చార్జీలను పెంచారని, రూ.15 వేల కోట్ల అదనపు భారాన్ని మోపడం ఏమిటని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విద్యుత్ పోరుబాట కార్యక్రమంలో ఆయన నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పాత బస్టాండు, కడప బస్టాండు మీదుగా అంబకపల్లె రోడ్డులో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా విద్యుత్ చార్జీల పెంపు నిలిపివేయాలి, విద్యుత్ చార్జీల పెనుభారం తగ్గించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కడప బస్టాండు సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి పేదల బతుకులు అతలాకుతలమయ్యాయన్నారు. సింహాద్రిపురం మండలంలోని ఎస్సీ కాలనీలో మూడు రోజులపాటు విద్యుత్ లేకుండా చీకట్లో కాలనీ ప్రజలు ఉన్నారని ఇదే టీడీపీ పాలనకు నిదర్శమన్నారు. పరిపాలన చేతకానీ చంద్రబాబు విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పి పెంచారన్నారు. టీడీపీ ప్రభుత్వం పేద ప్రజలకు 200 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. టీడీపీ నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించిందన్నారు. వేల సంఖ్యలో యువకులు, కార్యకర్తలు వచ్చి ఆయనకు మద్దతుగా నిలిచారన్నారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలలో పూర్తి వ్యతిరేకత భావం ఏర్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దోమలను చంపినా కూడా వారి చేతులకు రక్తం అంటిందన్న కారణంతో 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారని, అంత నీచ రాజకీయం చేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం విద్యుత్ డీఈ కార్యాలయంలో డీఈ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, అంబకపల్లె నారాయణస్వామి, రసూల్, సర్వోత్తమరెడ్డి, పుష్పనాథరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లె నాయకులు, ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్, కొమ్మద్ది నరసింహారెడ్డి, రవిశంకర్‌గౌడ్, ప్రసాద్, చంద్రమౌళి, కనక, శ్రీరాములు, మధురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఎస్టీ నాయకులు రాజేష్, సంపత్, మహేష్, బి.వి.సుబ్బారెడ్డి, చలమారెడ్డి, మాజీ డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జెడ్పీటీసీలు రవికుమార్‌రెడ్డి, బయపురెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, అరవిందనాథరెడ్డి, ఎంపీటీసీలు మనోహర్‌రెడ్డి, రాజాబాబు, జయచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సెడ్క్యాప్ మాజీ డైరెక్టర్ కిశోర్ కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ రజనికాంత్‌రెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రమేష్, ఎంపీపీ వెంకట నారాయణ, మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్ కుమార్, జెడ్పీటీసీ శివప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వరరెడ్డిలతోపాటు మండలాల నుంచి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ బిల్లులను తక్షణం తగ్గించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నరేన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం బయట ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కలసి పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ ఏఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏఈ చాంద్ బాషాకు కరెంట్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంట్‌ను సరఫరా చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ సాధారణంగా కరెంట్‌ను పట్టుకుంటే షాక్ తగులుతుందని, కాని కూటమి ప్రభుత్వంలో కరెంట్ బిల్లు ముట్టుకుంటేనే షాక్ కొడుతోందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో తాను ఐదేళ్ల కరెంట్ బిల్లులు పెంచనని, 30 శాతం వరకు కరెంటు బిల్లులు తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రూ.15,400 కోట్లు భారం విధించి ప్రజల నడ్డి విరిచాడన్నారు. కేవలం 40 లక్షల మందికి రూ.850 చొప్పున ఉచిత గ్యాస్‌కు సంబంధించిన నగదు జమ చేశారన్నారు. 100 రోజుల్లో సూపర్ సిక్స్ అమలు చేస్తామన్న చంద్రబాబు దానిని పూర్తి స్థాయిలో అమలు చేయలేన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్, కట్టుడు రాళ్లతో సహా అన్ని కొల్లగొట్టి అమ్ముకునే పరిస్థితి కూటమి ప్రభుత్వానిది అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెను భారం వేసిందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ఎల్లప్పుడూ పోరాడే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీనే అన్నారు. చిన్న పిలుపుతోనే నియోజకవర్గ మంతా వచ్చి ర్యాలీ విజయవంతం చేసినందుకు ప్రజలందరికి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసనగా కమలాపురంలో చేపట్టిన ర్యాలీకి ఎంఎల్‌సీ రమేష్ యాదవ్ హాజరై నరేన్ రామాంజులరెడ్డికి తన సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, వీరారెడ్డి, జీఎస్ భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ గండి భాస్కర్, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, టౌన్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, మణికంఠ శర్మ, హిదాయత్, కొండారెడ్డి, ఇర్ఫాన్, ఆర్‌వీ ఎస్‌ఆర్, లక్ష్మీనారాయణరెడ్డి, జావీద్, జిలానీ బాషా, అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, చేనేత కార్మికులు విద్యుత్ చార్జీలపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ అధికారంలోనికి రాకముందు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఇచ్చిన మ్యానిఫెస్టోలో ప్రజలకు విద్యుత్‌చార్జీలు పెంచమని 30 శాతం చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ పక్కన పెట్టి అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై డిసెంబర్ నెలలో రూ.7వేల కోట్లు, జనవరిలో రూ.9500 కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ఆ భారాన్ని ప్రజలపై మోపబోతుందన్నారు. మొత్తం రూ.16 వేల కోట్ల భారాన్నీ ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపబోతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అమలు చేస్తామని వాటిని కూడా అమలు చేయడంలేదు. చేనేత కార్మికులకు 200, మరమగ్గాలు కలిగిన వారికి 500 యూనిట్‌లను ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడునెలల కావస్తున్న ఇంత వరకు ఇచ్చిన హామీలలో ఒకటి కూడా నెరవేర్చలేకపోయారన్నారు. పెద్దముడియం మండలం బొడితిప్పనపాడు ఎస్సీల కుటుంబాలకు కరెంటు బిల్లులు తొమ్మిదివేలు, ఐదువేలు, నాలుగువేల రూపాయలు వస్తున్నాయన్నారు. ఉచితంగా విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత హామీలను పూర్తిగా పక్కన పెట్టిందన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ రైతుల, ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏడీ రాజగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి హనుమంతరెడ్డి, మాజీ హాజ్ కమిటీ చైర్మన్ బి.గౌస్ లాజం, మున్సిపాలిటీల అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, కెకె రమణారెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, కిరన్ మైలవరం నాయకులు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, శివగుర్విరెడ్డి, మోహన్‌రెడ్డి, రామాంజనేయులయాదవ్, జగదీశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ అశ్విని, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్లు ముల్లాజానీ, నూర్జహాన్, పోచిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు లక్ష్మయ్య యాదవ్, మార్బల్ శ్రీను, యెబు, రామమోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పులివెందులలో వైఎస్సార్‌సీపీ పోరుబాటలో పాల్గొన్న ప్రజలు


కమలాపురంలో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు కరెంట్ షాక్ ఇస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు నిరసనగా శుక్రవారం ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ బాలయ్య ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ ఏడీఈ కిరణ్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ శ్రేణులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచబోమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15 వేల కోట్లు విద్యుత్ భారం మోపారన్నారని మండిపడ్డారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలయ్య, కో–ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు జయరామకృష్ణారెడ్డి, మడిశెట్టి శివ, మల్లు కేశవరెడ్డి, ముద్దనూరు శ్రీధర్‌రెడ్డి, పెద్దనపాడు సాంబశివారెడ్డి, ప్రశాంత్, హరికృష్ణ, యల్లారెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో ఏడీకి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి


కమలాపురంలో వినతిపత్రం అందజేస్తున్న ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి


పులివెందులలో వైఎస్సార్‌సీపీ పోరుబాటలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ఎర్రగుంట్లలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎంపీ చొరవతో బాధితులకు ఉద్యోగాలు

వేముల : మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టుకు భూములు కోల్పోయిన బాధితులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో ఉద్యోగాలు లభించాయి. యురేనియం ప్రాజెక్టు కోసం యూసీఐఎల్ తుమ్మలపల్లె, మబ్బుచింతలపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె, కె.కె.కొట్టాల గ్రామాల పరిధిలో యూసీఐఎల్ భూములను సేకరించింది. అప్పట్లో భూములు కోల్పోయిన వారికి ప్రాజెక్టు ప్రారంభంలో బాధితులకు ఉద్యోగాలు కల్పించింది. అప్పటి భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారంతోపాటు అర్హులైన బాధితులందరికి ఉద్యోగాలను కల్పించింది. పెద్ద మొత్తంలో భూ సేకరణలో చేయడంలో, సేకరించిన భూముల మధ్యన కొంత భూమిని (మిస్సింగ్ ల్యాండ్) చేసుకోలేదు. అప్పటి నుండి బాధితులు మిస్సింగ్ ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుని ఉద్యోగాలను కల్పించాలని యూసీఐఎల్ కంపెనీ దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికి యూసీఐఎల్ బాధితులకు ఉద్యోగాలు కల్పించడంలో సుముఖత చూపలేదు. దీంతో బాధితులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి మిస్సింగ్ ల్యాండ్‌ను స్వాధీనపరుచుకుని ఉద్యోగాలు, పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూసీఐఎల్ అందులో 4 ఉద్యోగాలను 2022లో పర్మినెంట్ చేశారు. ప్రస్తుతం 7 మంది బాధితులకు యూసీఐఎల్ కంపెనీ ఉద్యోగాలు కల్పించారు.

ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన బాధితులు మాట్లాడుతూ భూములు కోల్పోయి పరిహారం, ఉద్యోగాలు రాకుండా యూసీఐఎల్ నిర్లక్ష్యం చేసినప్పటికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈవిషయమై కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరిపి ఉద్యోగాలు వచ్చేలా చేయడంలో విశేషంగా కృషి చేశారన్నారు. దీతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, యూసీఐఎల్ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చక్రాయపేట : వ్యాధుల పట్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలతో పాటు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని చక్రాయపేట, సురభి ఆరోగ్య కేంద్రాల పరిధిలో పర్యటించారు. తొలుత ఉప్పలవాండ్లపల్లెలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వే క్యాంపును ఆయన పరిశీలించి అక్కడికి వచ్చిన ప్రజలకు క్యాన్సర్, బీపీ, షుగర్ వంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం సురభి పీహెచ్‌ఇ పరిధిలో సురభి దళితవాడలో డెంగీ కేసు నమోదు కావడంతో అక్కడికి వెళ్లారు. పరిసరాల శుభ్రత తదితరాలపై ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ఆయన వైద్యసిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సత్వరం వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాజామైనుద్దీన్, డాక్టర్ ఖాజామోదీన్, చక్రాయపేట సురభి వైద్యులు వాణి, శివప్రసాద్, ఏఎంవో వెంకటరెడ్డి, ఎస్‌ఏ నరేష్, సీహెచ్‌వో వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉప్పలవాండ్లపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు

నీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, ఎంపీడీవో రాజశేఖరరెడ్డి

చక్రాయపేట : రానున్న రోజుల్లో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రాజశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సభాభవనంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి సమస్య ఉంటే తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని అలాగే పారిశుద్ధ్య చర్యలు కూడా చేపట్టాలన్నారు. మామిడి రైతులు తమ తోటలకు సంబంధించి డిసెంబర్ 31లోపు బీమా కట్టుకోవాలని ఏఈవో అంజలి తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గఫూర్, వేదమూర్తి, ఎంపీటీసీ సభ్యులు లీలావతి, నౌషాద్‌బీ, మోహన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మయ్య, కోఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

రుణాలను మాకు ఇప్పించండి

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఎర్రగుడిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న ప్రేమామయుడు డ్వాక్రా గ్రూపునకు సంబంధించిన మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు పుల్లమ్మ, కనకరత్న, భాగ్యమ్మ, జయమ్మలు మాట్లాడుతూ మా సంఘంలోని నూర్జహాన్ అనే మహిళ లోన్ డబ్బులు, స్త్రీనిధి, ఎస్‌ఎల్‌ఎఫ్ రుణాలను సుమారు రూ.4 లక్షలకుపైగా మాకు ఇవ్వకుండా తీసుకెళ్లిందని, మా రుణాలు మాకు ఇప్పించేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. సంఘంలోని సభ్యులందరూ నూర్జహాన్ ఇంటి ముందు మా డబ్బులు మాకు ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు. సంఘంలో ఉంటూ మిగిలిన సభ్యులు డబ్బులు తీసుకెళ్లడం మంచి పద్ధతి కాదని వారంటున్నారు. అధికారులు స్పందించి మా డబ్బులు వచ్చేలా చూడాలన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన అంబకపల్లె ప్రజలు

లింగాల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పులివెందుల పర్యటన ముగించుకుని రోడ్డు మార్గంలో బెంగళూరు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రోడ్డు మార్గంలో అంబకపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు, ప్రజలు భారీ ఎత్తున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసేందుకు రోడ్డు పైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గ్రామ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. గ్రామంలోని కుంటలకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను నింపాలని మొరపెట్టుకున్నారు. ఇప్పటికే గ్రామంలోని వ్యవసాయ బోరు బావులు అడుగంటిపోతున్నాయని వివరించారు. అదేవిధంగా గ్రామంలోని వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


అంబకపల్లె గ్రామ ప్రజలతో మాజీ సీఎం వైఎస్ జగన్

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. పెండ్లిమర్రిలో శుక్రవారం 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన 996 పనులకు సంబంధించి రూ.12 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. వాటిలో పండ్లతోటల పెంపకం, ఫారంపాడ్స్, డకౌట్ గుంతలు వంటి పనులు చేపట్టారు. విటిని సామాజిక తనిఖీ బృందం సభ్యులు పనులను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఓలు ఓబులమ్మ, రామాంజనేయరెడ్డి, డీఆర్పీలు, సీఆర్పీలు, ప్రజలు పాల్గొన్నారు.


సోషల్ ఆడిట్ నివేదికలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

మురుగునీటి విషయమై రాళ్లదాడి

జమ్మలమడుగు రూరల్ : మురుగు నీరు ఇంటి ముందరకు వస్తున్నాయని ఇరు వర్గాలు రాళ్లతో దాడి చేసుకున్న సంఘటన శుక్రవారం జమ్మలమడుగు మండలంలో జరిగింది.

ఎస్ఐ బి.రామకృష్ణ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గొరిగెనూరు గ్రామంలోని ధరణికుమార్‌రెడ్డి ఇంటి మురుగునీరు హేమంత్‌రెడ్డి ఇంటి ముందరకు వస్తున్నాయని ఘర్షణ పడి రాళ్లు రువ్వుకున్నారు. ఈ సంఘటనలో కొందరికి గాయాలు అయ్యాయి. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.